మద్యం మత్తులో గొడవ.. ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

బంజారాహిల్స్, జనవరి 2: రోజంతా మద్యం తాగుతుండటంతోపాటు సహజీవనం చేస్తున్న మహిళతో గొడవపడిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ప్రాంతానికి చెందిన ధర్మ(35) అనే వ్యక్తి సినిమా షూటింగ్స్‌లో ఆర్ట్ డిపార్ట్‌మెంట్స్‌లో పని చేస్తుంటాడు. భార్యతో గొడవపడి వేరుగా ఉంటున్న ధర్మకు నాలుగేళ్ల కిందట మల్లమ్మ(39) అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారిద్దరూ కలిసి ఇందిరానగర్‌లో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. కాగా, బుధవారం నూతన సంవత్సరం కావడంతో ఫ్రెండ్స్‌తో రోజంతా మద్యం సేవించిన ధర్మ సాయంత్రం ఇంటికి వచ్చాడు. అనంతరం రాత్రి 7.30గంటల సమయంలో మరోసారి మద్యం తెచ్చుకుని దూరపు బంధువైన దుర్గ అనే వ్యక్తితో కూర్చుని తాగుతున్నాడు. అయితే రోజంతా తాగేసి వచ్చావు.. మళ్లీ ఎందుకు తాగుతున్నావంటూ మల్లమ్మ ప్రశ్నించింది. దాంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. అంతటితో ఆగకుండా ఆమెపై దాడి చేశాడు. రాత్రి 10.30 గంటల సమయంలో మరోసారి ఆమెపై దాడి చేసి ఇంట్లోంచి బయటకు పంపించాడు. అనంతరం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చి సుమారు గంటసేపు ఆమె బయటనే కూర్చున్నది. ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. తలుపులు వేసుకొని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా.. అతడు అప్పటికే మృతి చెంది ఉన్నాడు. బంజారాహిల్స్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మృతుడు ధర్మ(ఫైల్)

అబిడ్స్‌లోని గుజరాతీ గల్లీలోని రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీ దగ్ధం

లారీలో ఎగిసిపడుతున్న మంటలు

జీడిమెట్ల, జనవరి 2: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ లారీ దగ్ధమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. జీడిమెట్ల ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం... సుభాష్‌నగర్‌లోని దక్కన్ ట్రాన్స్‌పోర్టులో విజయవాడకు చెందిన లారీ(ఏపీ 16వై 6246)లో హార్డ్‌వేర్, పెయింట్స్, టిన్నర్ లోడ్‌తో బుధవారం రాత్రి 10 గంటలకు విజయవాడకు బయలుదేరింది. కిలో మీటరు ప్రయాణించగానే జీడిమెట్ల పారిశ్రామికవాడకు చేరుకోగానే ఆకస్మికంగా లారీలో మంటలు వచ్చి అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో 3గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో లారీ సగానికి పైగా కాలిపోయింది. మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన లారీ డ్రైవర్ కిందికి దిగి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహా కుంభమేళాకు 26 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): మహా కుంభమేళాకు 26 అదనపు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు గురువారం ఎస్‌సీఆర్ అధికారులు తెలిపారు. గుంటూరు, విజయవాడ, మౌలాలి, కాచిగూడ, సికింద్రాబాద్, వికారాబాద్, నాందేడ్ వంటి రైల్వే స్టేషన్ల నుంచి కుంభమేళాకు ఫిబ్రవరి 5నుంచి 27వ తేదీ వరకు షెడ్యూల్ వారీగా ప్రత్యేక రైళ్లు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎస్‌సీఆర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

డ్రగ్స్ విక్రయానికి ప్లాన్.. ప్లాస్టిక్ వ్యాపారి అరెస్ట్

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): న్యూ ఇయర్ వేడుకలకు డ్రగ్స్ విక్రయించేందుకు యత్నించిన ఓ యువకుడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం... ప్లాస్టిక్ వ్యాపారం నిర్వహించే జవహర్ కిషన్ గోపాల్ బంజారాహిల్స్ రోడ్డు నం.12లో నివాసముంటాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడటంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఈజీగా డబ్బు సంపాదించేందుకు అతడి స్నేహితులైన అనిల్, వరుణ్, ప్రమోద్‌లు డ్రగ్స్ వ్యాపారంలో డబ్బు సంపాదించవచ్చంటూ ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలోనే ముంబైలో ఉన్న ఓ నైజీరియన్‌ను కాంటాక్టు అయిన గోపాల్ ముంబై వెళ్లి 30 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకొని హైదరాబాద్‌కు వచ్చాడు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎక్కువ ధరకు విక్రయించాలనే ప్లాన్‌లో ఉండగా... మాసబ్ ట్యాంక్ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 క్రికెట్ జట్టుకు తెలుగు కుర్రాడు

రాపోల్ సాయి సంతోష్

మన్సూరాబాద్, జనవరి 2: హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన రాపోల్ సాయి సంతోష్ దేశవాళీ 2024-25 సీజన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యాడు. బీసీసీఐ మెన్స్ అండర్-23 స్టేట్-ఏ ట్రోఫీ కోసం జరుగనున్న పోటీలకు అరుణాచల్‌ప్రదేశ్ క్రికెట్ జట్టు తరఫున ఆడనున్నాడు. 21 ఏండ్ల రాపోల్ సంతోష్ బౌలింగ్ ఆల్‌రౌండర్, ఫాస్ట్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ విశేష ప్రతిభ కనబర్చాడు. గత సంవత్సర కాలంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన వివిధ టోర్నమెంట్లలో సంతోష్ పాల్గొని మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అతడిలోని ప్రతిభను గుర్తించిన సెలెక్టర్లు సంతోష్‌ను అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 జట్టుకు ఎంపిక చేశారు. పన్నెండు సంవత్సరాల వయస్సు నుంచి క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన సంతోష్ అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయి అండర్-16, అండర్-17 స్కూల్ గేమ్స్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అండర్-16 విజయ్‌మర్చంట్ ట్రోఫీలోనూ పాల్గొని మంచి ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌కు చెందిన కె.వినోద్‌కుమార్, బీఏజీ వాల్టర్ వద్ద శిక్షణ పొంది క్రికెట్‌లో మెలకువలు నేర్చుకున్నాడు.

పోయిన సొత్తు సగం రికవరీ..

డిజిటల్ అరెస్ట్‌లో వృద్ధురాలి సొమ్ము కాజేసిన సైబర్స్..

రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు సీపీ అభినందన

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్ట్‌తో డబ్బు కోల్పోయిన ఓ వృద్ధురాలికి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు తిరిగి ఆ డబ్బును ఇప్పించారు. గత నెల 8వ తేదీన ఉప్పల్ ప్రాంతానికి చెందిన గీతా ఉపాధ్యాయ అనే 65 ఏండ్ల మహిళకు సైబర్ నేరగాళ్లు 'తాము పోలీసులమంటూ భయపెట్టి ఆమెను డిజిటల్ అరెస్ట్ చేశారు. మీపై మనీలాండరింగ్ కేసు నమోదైందంటూ బెదిరించి ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేయించి రూ.1,58,70,000 కాజేశారు. దీంతో బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఏసీపీ శిశశంకర్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ బృందం కేసు దర్యాప్తు చేసింది. సైబర్‌నేరగాళ్లకు చెందిన ఉత్తరప్రదేశ్ మురబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకులో డబ్బు డిపాజిట్ అయినట్లు గుర్తించి ఆ ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఆ తరువాత న్యాయపరమైన చర్యలతో ఆ ఖాతాలో ఉన్న రూ.70,01,788 నగదును తిరిగి బాధితురాలి ఖాతాలోకి రప్పించారు. పోయిన సొమ్ములో దాదాపు సగం సొమ్మును బాధితురాలికి ఇప్పించడంలో స్పందించిన సైబర్ క్రైమ్ సిబ్బందిని డీసీపీ నాగలక్ష్మి, రాచకొండ సీపీ సుధీర్‌బాబులు అభినందించారు.

బాల్కనీలో పడి బాలిక మృతి

ఘట్‌కేసర్, జనవరి 2: ఇంట్లోని బాల్కనీలో పడి ఓ బాలిక మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోచారం పోలీసులు తెలిపిన ప్రకారం.. పోచారంలోని రెడ్డి నివాసంలో ఉండే వాస చంద్రశేఖర్ కుమార్తె వాస శ్రీజ(16) ఇంటి బాల్కనీలో ప్రమాదవశాత్తు పడిపోగా చికిత్స నిమిత్తం ఉప్పల్ సమీపంలోని ఓ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శ్రీజ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి కోసం ప్రత్యేక టీమ్‌లు

ఖైరతాబాద్, జనవరి 2: వ్యాపారి హత్య కేసులో నిందితుడిని పట్టుకునేందుకు పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిగూడలోని బీఎస్ఎన్ఎల్ గల్లీలో నివాసం ఉండే విష్ణు రూపాని(45) గత నెల 29న అదృశ్యమై, జనవరి 1న ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోని బుద్ధ నగర్‌లోని గదిలో శవమై కనిపించాడు. మృతుడు ఇంటి నుంచి ప్రస్తుతం మృతి చెందిన గది వరకు పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు.29వ తేదీన నిందితుడి వాహనం వెనుక సీట్లో కూర్చున్న వ్యక్తిపైనే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యక్తి కనిపించడంలేదు. అతడి కోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు.

సెట్విన్‌లో కొత్త కోర్సులు

చార్మినార్, జనవరి 2: నిరుద్యోగ యువతీ యువకులకు మరింత మెరుగైన శిక్షణ అందించడానికి సెట్విన్ కొత్త కోర్సులను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నదని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు తెలిపారు. గురువారం ఆయన సెట్విన్ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఈవీ మోటారు వాహనాలు విస్తృతంగా వినియోగంలోకి రానున్నాయని, ఈ నేపథ్యంలో ఆ రంగంలో యువత మరింతగా రాణించడానికి అనుగుణంగా ఈవీ కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ కోర్సును నల్గొండలో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈవీ కోర్సును త్వరలో పాతనగరంలోని మిరాలం ట్యాంక్‌లోని సెట్విన్ శిక్షణ కేంద్రంలోనూ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కొత్త కోర్సులను సెట్విన్‌లో అందుబాటులోకి తీసుకువస్తూ మరిన్ని కేంద్రాలను సైతం గ్రామీణ యువతకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. జహీరాబాద్‌తోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రాంతాల్లోనూ సెట్విన్ శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం సెట్విన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ 30 కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సెట్విన్ ఆధ్వర్యంలో మెరుగైన శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిప్లొమా ఫ్యాషన్ టెక్నాలజీతోపాటు ఫైతాన్, టూరిజం మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులతో పాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించే కోర్సులను సెట్విన్‌లో అందిస్తున్నామని వేణుగోపాల్‌రావు తెలిపారు.

సీఎంఆర్‌లో ఉద్రిక్తత

బాత్రూమ్‌లో వీడియోల చిత్రీకరణపై విద్యార్థినుల ఆగ్రహం

నిందితులపై చర్యలకు డిమాండ్.. విద్యార్థి సంఘాల మద్దతు

యాజమాన్యంపై తల్లిదండ్రుల ఆక్రోశం

పోలీసుల అదుపులో ఏడుగురు

సుమోటోగా కేసు స్వీకరించిన మహిళా కమిషన్

మేడ్చల్, జనవరి 2: విద్యార్థినులు స్నానాల గదిలో ఉండగా సెల్‌ఫోన్‌లో వీడియోలు చిత్రీకరించారని ఆరోపిస్తూ మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. బుధవారం సాయంత్రం ప్రారంభమైన ఆందోళన గురువారం రాత్రి వరకు కొనసాగింది. విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నేతలు తరలి వచ్చి, హాస్టల్ గేట్ ముందు బైఠాయించి, ఆందోళన చేశారు. విద్యార్థినులు, తల్లిదండ్రులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాలకు అనుబంధంగా పక్కనే విద్యార్థినుల వసతికి హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు అంతస్తుల భవనంలో కింది అంతస్తులో మొదటి సంవత్సరం విద్యార్థినుల వసతికి ఏర్పాట్లు చేయగా.. పై అంతస్తుల్లో మిగితా విద్యార్థినులకు వసతి ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి డిసెంబర్ 31 సందర్భంగా విద్యార్థినులు రాత్రి వరకు మేల్కొని సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఓ విద్యార్థిని స్నానాల గదిలోకి స్నానం చేయడానికి వెళ్లగా.. ఎవరో వెంటీలెటర్‌లో నుంచి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్టు, ఓ వ్యక్తి అటుగా వచ్చినట్టు నీడను గుర్తించి గట్టిగా అరిచింది. ఆ విద్యార్థిని హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డి దృష్టికి తీసుకుపోవడంతోపాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి విద్యార్థినుల స్నానాల గదులను పరిశీలించగా.. వెంటీలెటర్ల వద్ద ఫింగర్ ప్రింట్స్ కన్పించాయి. అయితే వార్డెన్‌ను విచారించి, తగిన చర్యలు చేపట్టకపోగా.. విద్యార్థినులతో అనుచితంగా మాట్లాడారు. తల్లిదండ్రులకు కూడా పూర్తి స్థాయిలో భరోసానివ్వలేదు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు హాస్టల్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. వారికి విద్యార్థి సంఘాల నేతల మద్దతు పలుకడంతో ఆందోళన మరింత తీవ్రమైంది.

పోలీసుల అదుపులో ఏడుగురు

హాస్టల్ కిచెన్‌లో పని చేసే బీహార్‌కు చెందిన సిబ్బందికి హాస్టల్ వెనుక భాగంలో నివాసానికి ఏర్పాట్లు చేశారు. వారు విద్యార్థినుల స్నానాల గదిలో ఉండగా వీడియో చిత్రీకరించే అవకాశం ఉన్నట్టు అనుమానిస్తూ ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని 11 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. తొలగించిన డేటా తిరిగి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఐదుగురి సిబ్బందితోపాటు మెస్ ఇన్‌చార్జి, వార్డెన్‌ను కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇప్పటి వరకు విద్యార్థినుల వీడియోలు, ఫొటోలు లభించలేదు. బయటకు కూడా రాలేదు. ఏసీపీ శ్రీనివారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోపణల నేపథ్యంలో హాస్టల్‌ను పూర్తిగా పరిశీలించామన్నారు. వెనుకవైపు మాత్రం యాజమాన్యం నిర్లక్ష్యం కన్పిస్తుందన్నారు. వెంటీలెటర్ల వద్ద ఉన్న ఫింగర్స్ ప్రింట్స్ కూడా సేకరించామన్నారు. పూర్తి విచారణ చేసి, నిందితులను గుర్తిస్తామని చెప్పారు. సీఎంఆర్ కళాశాల ప్రాంగణంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్, దుండిగల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ల నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది పహరా నిర్వహించారు.

సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్

మీడియాలో వచ్చిన వార్త కథనాల ఆధారంగా రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా ఈ ఘటనపై విచారణ చేపట్టింది. గురువారం సాయంత్రం సీఎంఆర్ ఐటీ కళాశాల లేడీస్ హాస్టల్‌కు మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ చేరుకొని, విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు సుమోటో ఘటనను తీసుకొని, విచారణ చేపట్టామని తెలిపారు. కాగా సీఎంఆర్ యాజమాని గోపాల్ రెడ్డి విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, అన్ని చర్యలు తీసుకొని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు విచారణ చేస్తున్నారని, వేచిచూస్తే అన్ని విషయాలు బయటికి వస్తాయన్నారు. అందుకనుగుణంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అయితే విద్యార్థినులు ఆయన హామీలకు సంతృప్తి చెందలేదు. వార్డెన్ ప్రీతి రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆహ్లాదకరంగా ఉద్యాన్ - ఉత్సవ్

సందర్శకులను అలరించిన వివిధ రాష్ట్రాల సాంస్కృతిక నృత్యాలు

జనవరి 13వ తేదీ వరకు వేడుకలు

స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ప్రగతిశీల రైతు సురేశ్, అధికారులు

బొల్లారం, జనవరి 2: ప్రకృతి ఔత్సాహికులకు, ఉద్యాన వన ప్రేమికులను మంత్రముగ్ధులను చేసే దృశ్యాలను అందించి పుష్పాలు, పుష్పేతర ప్రదర్శనల విస్తృత శ్రేణిని ప్రదర్శించడానికి 'ఉద్యాన్ - ఉత్సవ్' ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని రాష్ట్రపతి భవన్ అధికారి సమరేశ్ అన్నారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ - ఉత్సవ్ ప్రదర్శనలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ సామ్యూల్ ప్రవీణ్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ డా. శరవణన్, ఫైక్ మీరా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్, తెలంగాణ ఏడీఏ హుస్సేన్ బాబు, ఫార్మర్ వెల్ఫేర్ అడిషనల్ కమిషనర్ సంజయ్ కుమార్, రాష్ట్రపతి భవన్ డైరెక్టర్ శివేంద్ర చతుర్వేది హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు సాధికారత సమితి, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నిర్వాహిత సహజ వ్యవసాయ శాస్త్రవేత్తలు సహజ వ్యవసాయం హార్టికల్చర్ పద్ధతులు, ఆలుగడ్డ, అల్లం పంటలపై నిర్వహణ పద్ధతులు పంటల సంస్కరణలో మంచి హార్టికల్చర్ పద్ధతులు, కూరగాయల పంటల సాగుతో పాటు వివిధ సాంకేతికత అంశాలపైనా రైతులకు అవగాహన కల్పించారు. సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాల నృత్యాలు, ఆదివాసీ నృత్యాలను, మహాభారతంలోని శ్రీకృష్ణ రాయబార ఘటాన్ని ప్రదర్శించి సందర్శకులను అలరించారు. ఉద్యాన్ - ఉత్సవ్‌లో భాగంగా వివిధ వర్సిటీల, ఎన్‌జీఓ, కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్ నుంచి సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు. గురువారం ఒక్కరోజే సుమారు 6000 మంది సందర్శకులు, పాఠశాల, ఎన్‌సీసీ క్యాడెట్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు జనవరి 2 నుంచి 13 వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని నిలయం అధికారిణి రజినీ ప్రియ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రపతి పబ్లిక్ రిలేషన్స్ అధికారి సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పంటించుకుని యువకుడి బలవన్మరణం

గండిపేటలో ఘటన

మల్లిఖార్జున్ (ఫైల్)

మణికొండ, జనవరి 2: నిర్మాణుష్య ప్రాంతంలో ఓ యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పూర్తి వివరాల్లోకి వెళితే... లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన మల్లిఖార్జున్(31) యువకుడు గురువారం సాయంత్ర గండిపేట చెరువు సమీపంలోని నిర్మాణుష్య ప్రాంతానికి వెళ్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడి ఆర్థనాదాలు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని చూసేలోపే అధిక శాతం కాలిపోయాడు. అనంతరం అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లంగర్‌హౌస్ నుంచి గండిపేటకు మృతుడు ఎందుకు వచ్చాడు? బలవన్మరణానికి కారణాలేమిటనే అంశాలపై విచారణ చేపడుతున్నామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణరెడ్డి తెలిపారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ 8 గంటలపాటు అంకిత భావంతో పనిచేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఉద్యోగులకు సూచించారు. నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం సింగరేణి భవన్‌లో ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పనితీరును మదింపు చేస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్ష్యాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట జనక్‌ప్రసాద్, సుబానీ, రవిప్రసాద్, సూర్యనారాయణరాజు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-326616

CHITS & DEPOSITS

★Regd. Chits: 5L, 10L, 15L, 20L, 25L, 50L & 1 Crore Chits. Commitment available. Contact: 8464919899. NT-326882

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990. NT-326901

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 25/01-కర్ణాటక; 18/02-కాశీ; 14/03-ముక్తినాథ్; 04/05-చార్‌ధామ్, 07/05-దో ధామ్, సరస్వతి పుష్కరాలు @ 9676637578, 9908844377. NT-326634

PLOT FOR SALE

★Bhongiri Yellamma Temple Opp. HMDA Villa Plots & Ghatkesar Two HMDA Villas "Low Cost". Cont: 9121830146, 9154270146. NT-326617

★Farm Plots for Sale: 3000 Per Sq.Yard, Near 400 Acres Govt. Sez, Kalwakurthy, Srisailam Highway. Ph: 7981200477. NT-326920

★శ్రీ బాలాజీ రెసిడెన్సీ @ కేశంపేట, షాద్‌నగర్ DTCP & RERA Aprvd. లేఔట్ Plots గజం @ 10,666/- (పండుగ ఆఫర్: నెలకు 20 వేల EMIతో 50 నెలలు). 9949695027. NT-326927

PLOT FOR SALE

★JB's INFRA PROJECTS offering Highway Facing HMDA, DTCP Plots Kongarakalan, Ibrahimpatnam, Mall, Choutuppal. Bank Loan avilable. Call for more details: 9985247475. NT-338993

LAND FOR SALE

★TCS ఆదిభట్ల, బొంగులూరు, కొంగర, తుక్కుగూడ ఏరియాలలో ప్లాట్లు, ల్యాండ్స్ కొనబడును, అమ్మబడును. TCS దగ్గరలో రెంటల్ హాస్టల్ బిల్డింగులు అమ్మబడును. డెవలప్‌మెంట్ సైట్లు కావలెను. SLN Realtors & డెవలపర్స్. Ph: 9949165733. NT-335192

FLAT FOR SALE

★3BHK Flat at C-6/503, Sanskruthi Township, Near Pocharam Infosis, Near Warangal Highway. Contact: 9440476684 / 9550163401. NT-326631

WANTED

★సోమాజిగూడ ఏరియాలో ప్రముఖ హాస్పిటల్ నందు అంబులెన్స్ మరియు కారు నడుపుటకు అనుభవజ్ఞులైన డ్రైవర్లు కావలెను. మంచి జీతం కలదు. PF మరియు ESI సౌకర్యం కలదు. సంప్రదించగలరు. 9154638558. NT-327501

CHANGE OF NAME

★I, D.SUSHILA, W/o. Dubba Ravinder, R/o. H.No. 7-1-302/52 Dasaram Basthi, S.R.Nagar, Hyderabad. Changed My Name as DUBBA SHARADA for all Records purposes. NT-1619

★I, AKULA RAMESH BABU, H.No. 21-118/14/1, Chilka Nagar, Uppal, Medchal-Malkajgiri District, Hyderabad-500 039. Changed My Daughter Name from GOURLA PRANATHI, D/o. G.Raji Reddy to AKULA PRANATHI, D/o. Akula Ramesh Babu. NT-326636

★I, GADAM SURENDER, S/o. Gandham Seetha Rama Rao, H.No. LIG-1-206, Housing Board Colony, Miryalaguda (Vil) & Mandal, Nalgonda District-508 207. Changed My Name as GANDHAM SURENDER. NT-337772

★I, K.LEELAMMA, W/o. K.Ramuluiah, R/o. 15-39, Ex-Servicemen Colony, Balajin